క్లుప్తంగా

30న పింఛన్ల పంపిణీ

మాడుగుల రూరల్ : ఈ నెలలో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేశారని స్థానిక ఎంపీడీవో కొంకి అప్పారావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబరు 1 వ తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగా నవంబర్ 30వ తేదీ శనివారం పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. అందుకు గ్రామ కార్యదర్శులు ఈ నెల 29 వ తేదీన బ్యాంకు నుంచి నగదు డ్రా చేయాలని సూచించారు. శనివారం ఉదయం 5:30 గంటలకు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ కావాలని అన్నారు. మండలంలో గల 23 గ్రామ సచివాలయాల పరిధిలో 11,674 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ముమ్మరంగా గోతుల పూడ్చివేత పనులు



మున్సిపాలిటీలో సీసీ రోడ్ల గుంతలను పూడ్చివేత పనులు

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధిలోని సీసీ రోడ్లలో గోతుల పూడ్చివేత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డుల్లో సీసీ రోడ్లలో 32 గోతులను గుర్తించామని, రూ.3 లక్షలతో వాటి మరమ్మతు పనులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. సీసీ రోడ్లల్లో ఎక్కడా గోతులు లేకుండా ముమ్మరంగా పనులు జరుగుతున్నాయని కమిషనర్ తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో పల్లె వనం



మాడుగుల ప్రభుత్వాసుపత్రి ఆవరణలో యంత్రాలతో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

మాడుగుల : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పల్లె వనం కార్యక్రమంలో భాగంగా నిరుపయోగంగా ఉన్న ఎకరా స్థలంలో సర్పంచ్ ఎడ్ల కళావతి వార్డు సభ్యుల సహకారంతో తుప్పలు తొగించారు. ఈ స్థలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జామ కొబ్బరి మొక్కలతో పాటు ఐదు రకాల మొక్కలు వేయడానికి ప్రతిపాదన చేశామని, ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

నల్లమారమ్మను దర్శించుకున్న స్పీకర్



అమ్మవారిని దర్శించుకుంటున్న స్పీకర్ అయ్యన్న

మాకవరపాలెం : నల్లమారమ్మ తల్లిని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దర్శించుకున్నారు. జి.కోడూరులో గురువారం నల్లమారమ్మతల్లి జాతర నిర్వహించారు. ఈ నేపథ్యంలో సాయంత్రం అయ్యన్నపాత్రుడు ఈ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, మళ్ల జయబాబు ఉన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



బోయిలకింతాడలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ బాబూరావు

దేవరాపల్లి : స్థానిక రైతు సేవా కేంద్రంలో రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. బోయిలకింతాడ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు చేతుల మీదుగా రైతులకు అందజేశారు. అనంతరం సచివాలయంలో జరిగిన ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామసభలో బాబూరావు మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించేలా అనువైన పనులు గుర్తించాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు, గోవాడ చక్కెర కార్మాగారం చెరకు అభివృద్ధి మండలి సంస్థ డైరెక్టర్ అన్నం రాము, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాము నాయుడు, పాల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, సాంబమూర్తి, అగ్రికల్చర్ అసిస్టెంట్ యశోద, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింగరావు పాల్గొన్నారు.

20 గ్రామాల కల... నెరవేరుతున్న వేళ...

- కాశీపురం-గవరవరం రోడ్డు విస్తరణ పనులు పునఃప్రారంభం
- గత ప్రభుత్వ హయాంలో రూ.20 కోట్లు మంజూరు
- దాదాపుగా కల్వర్టుల నిర్మాణం పూర్తి



రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు



జోరుగా కొనసాగుతున్న గవరవరం-కాశీపురం రోడ్డు విస్తరణ పనులు

దేవరాపల్లి : కాశీపురం-గవరవరం రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు పునఃప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు విస్తరణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీఆర్ఐఎఫ్ నిధులు రూ.20 కోట్లు మంజూరు చేసింది. రోడ్డు దుస్థితిని, తద్వారా ప్రజల ఇబ్బందులను అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు గాను రూ.20 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిర్మాణ పనులకు బోయిలకింతాడలో గత ఏడాది ఏప్రిల్ 30 శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని అప్పటి డిప్యూటీ సీఎం బూడి, ఎంపీ సత్యవతి, వై.వి. సుబ్బారెడ్డి, కరణం ధర్మశ్రీ తదితరులతో కలిసి ఆవిష్కరించారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు

అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో చక చకా పనులు జరిగాయి. ఈ రోడ్డులో 48 కల్వర్టులకు గాను 42 కల్వర్టుల నిర్మాణం గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు ఐదు నెలల తర్వాత తాజాగా రోడ్డు నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయి. గతంలో 12.5 అడుగుల వెడల్పు మాత్రమే ఉన్న రోడ్డును, ప్రస్తుతం 25 అడుగుల వెడల్పున విస్తరిస్తున్నారు. గవరవరం వైపు నుంచి రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను ఆర్అండ్‌బీ ఏఈ పి. శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.



కలిగొట్ల వద్ద పూర్తయిన కల్వర్టు నిర్మాణం

డబుల్ రోడ్డుగా..

ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే దేవరాపల్లి మండలంలోని 20 గ్రామాలతో పాటు అనంతగిరి మండలంలోని పలు గ్రామాలకు చోడవరం చేరుకునేందుకు మార్గం సలభతరమవుతుంది. డబుల్ రోడ్డుగా రూపాంతరం చెందుతుండడంతో బూడికి స్థానిక ప్రజలు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

బూడి కృషి వల్లే...



గవరవరం-కాశీపురం రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలు కష్టాలు తీరుతాయి. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ఇటుగా ప్రయాణించే వారి ఒళ్లు హూనం అయిపోతుంది. మరికొంత మంది ప్రత్యామ్నాయ రోడ్లలో రాక పోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణకు రూ. 20 కోట్లు నిధులు మంజూరు చేసిన మాజీ సీఎం జగన్‌కు, మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడుకు తామంతా రుణపడి ఉంటాం.

–బూరె బాబూరావు, బోయిలకింతాడ సర్పంచ్

సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు



ఈ రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్లు గతంలోనే మంజూరయ్యాయి. 12.5 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 25 అడుగుల వెడల్పున విస్తరిస్తున్నాం. 42 కల్వర్టులు పూర్తయ్యాయి. గవరవరం సరిహద్దు నుంచి 12 కి.మీ మేర మాత్రమే రోడ్డు విస్తరణకు ఈ నిధులు సరిపోతాయి. పెదనందిపల్లి వరకు మాత్రమే రోడ్డు విస్తరణ జరిగే అవకాశం ఉంది. అదనంగా నిధు లు మంజూరు చేస్తే కాశీపురం వరకు కొనసాగిస్తాం. పనులను 8 నెలల్లో పూర్తి చేసే చర్యలు తీసుకుంటున్నాం.

–పి.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఏఈ

బాల్య వివాహాలు నేరం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు

నాతవరం : బాల్య వివాహాలు చేయడం చట్ట రిత్యా నేరమని గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి అన్నారు. మండలంలో ఎం.బి.పట్నం పంచాయతీలో గురువారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి హైస్కూల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అందువల్ల అవగాహన ర్యాలీలు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన వయస్సు దాటాకే వివాహాలు చేయాలన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



దేవరాపల్లిలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న అధికారులు

దేవరాపల్లి : బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని దేవరాపల్లి మహిళా సంరక్షణ కార్యదర్శులు పి.ఎం సంధ్యారాణి, షేక్ మీరాబి అన్నారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా సీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలతో వచ్చే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీడ్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ ఎల్.ఉషారాణి, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళులు



మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం : మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పెదబొడ్డేపల్లి వైఎస్సార్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం పూల మాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలోని కుల వివక్షను రూపుమాపడానికి పూలే నిరంతరం కృషి చేశారని చైర్‌పర్సన్ కొనియాడారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, కర్రి శ్రీనివాసరావు, తమరాన శ్రీను, మామిడి శ్రీను, చీటీల రాము పాల్గొన్నారు.

జనవరి 5న హైందవ శంఖారావం



సమావేశంలో మాట్లాడుతున్న రామకొండలరావు

మాడుగుల రూరల్ : వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాడుగుల మండల కన్వీనర్ రాపేట రామకొండలరావు పేర్కొన్నారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి ఖండ, ఇతర కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జనవరి 5న జరిగే ఈ కార్యక్రమానికి 4 వ తేదీన ఇక్కడ నుంచి బయలుదేరి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సహ కన్వీనర్, కమిటీ సభ్యులు వాలంకి శ్రీనివాసరావు, సన్యాసిశెట్టి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



కె.కోటపాడు హైస్కూల్లో పది విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు : పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖాధికారి డీవీడీ ప్రసాద్ అన్నారు. కె.కోటపాడు హైస్కూల్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పది విద్యార్థులకు జరుగుతున్న బోధనను పరిశీలించారు. ఉదయం, సాయంత్రం వేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అదనపు తరగతులను తప్పక నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచించారు. మండలంలో ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకూ చదువులు సాగిస్తున్న 5320 మందికి 4567 మంది విద్యార్థుల ఆపార్ నమోదు కార్యక్రమం పూర్తయి, జిల్లాలో ఈ కార్యక్రమంలో కె.కోటపాడు ముందుందని ఎంఈవో తెలిపారు. ఇన్‌చార్జి హెచ్ఎం హిమబిందు, ఉపాధ్యాయుడు మల్లాది కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటుకున్న శక్తిని తెలుసుకోండి



కళాశాల విద్యార్థులకు ఓటు నమోదు కార్యక్రమం

చోడవరం రూరల్ : ఓటు నమోదు వయో అర్హత ఉన్న యువత తమ ఓటుకున్న పవర్ తెలుసుకుని తక్షణం నమోదు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ సూచించారు. గురువారం ఆయనతోపాటు మండల తహసీల్దార్ ఎ.రామారావు నేతృత్వంలో డిప్యూటీ తహసీల్దార్ వి.రాజ్‌భరత్ సిబ్బందితో కలసి విద్యార్థుల ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. వచ్చే నెల డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు ఆయా మండల తహసీల్దార్ కార్యాలయాలకు తమ ఓటు నమోదు దరఖాస్తు అందచేయాలని సూచించారు. 110 మంది విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, సీనియర్ ఉపన్యాసకులు హెచ్.సుధీర్, ఎస్ఎం రఫీయుద్దీన్, వి.అప్పలనాయుడు, ఎ.కృష్ణారావు, కోమల, రామలక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

దాత సహకారంతో తోడపెద్దు వితరణ



తోడపెద్దుతో దాత సత్యనారాయణ

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో వేగి వారి తోడపెద్దు ఈ ఏడాది మే 19 వ తేదీన అనారోగ్యంతో కాలం చేసింది. భోగి పండగ రోజున జన్మించిన దూడను తోడపెద్దుగా మార్చి పూజలు చేస్తారు. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లాలో నందిగామలో తోడపెద్దును ఇటీవల కోనుగోలు చేశారు. దీనికి కె.జె.పురం గ్రామానికి చెందిన శిరిజాం నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మద్దాల వెంకట సత్యనారాయణ(రమణ) ఆర్థిక సహకారం అందజేశారు. వచ్చే నెల 6వ తేదీన కె.జె.పురం గ్రామంలో తోడపెద్దుకు పాల అచ్చు వేసి, నామకరణం చేయనున్నట్టు వేగి వారి తోడ పెద్దు గరిడీ దాసుడు వేగి హరికృష్ణ గురువారం తెలిపారు. అదే రోజు తోడపెద్దుకు ముక్కుతాడు వేస్తారని. ఈ సందర్భంగా గ్రామంలో భారీ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. నాటి నుంచి తోడపెద్దుకు నిత్య పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

తపాలా బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోండి



పోస్టుమాస్టర్ నాయుడు

నర్సీపట్నం : కాలానుగుణంగా తపాలా శాఖ ద్వారా సత్వర సేవలు అందుబాటులోకి వచ్చాయని నర్సీపట్నం ప్రధాన తపాలా కార్యాలయం పోస్టుమాస్టర్ ఎం.సీహెచ్.నాయుడు తెలిపారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఎప్పటికప్పుడు వినియోగదారుల శ్రేయస్సు కోసం ఐపీపీబీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం ఐపీపీబీ ఖాతాలకు ఎన్‌పీసీఐకి అనుసంధానం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఎన్‌పీసీఐ ఖాతాల రిజిస్ట్రేషన్ ముమ్మరంగా జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యేందుకు ఎన్‌పీసీఐ లింక్ దోహదపడుతుందన్నారు. ఒకప్పుడు ఉత్తరాల పంపిణీకి పరిమితమైన పోస్ట్ ఆఫీస్ కొత్తగా బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. బయోమెట్రిక్ ద్వారా ఖాతా తెరుచుకోవాలన్నారు. మారుమూల గ్రామాల్లో తపాలా సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇతర బ్యాంక్‌ల్లో అకౌంట్ ఉన్నప్పటికీ పోస్టల్‌లో రోజుకు రూ.10 వేలు వరకు నగదు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు.

లింగ ఆధారిత హింసను అరికట్టాలి



కె.కోటపాడు వెలుగు మహిళలతో కలిసి ర్యాలీ కార్యక్రమంలో ఏపీఎం చినబాబు

కె.కోటపాడు : రాష్ట్రంలో మహిళలపై జరిగే ఎటువంటి దాడులు, హింసలకు పాల్పడినా అన్ని వర్గాల వారు వ్యతిరేకించాలని వెలుగు ఏపీఎం చినబాబు అన్నారు. కె.కోటపాడులో వెలుగు ఆధ్వర్యంలో గురువారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ఆడపిల్లలు, మగ పిల్లల మధ్య తారతమ్యం చూడరాదని, బాల్య, బలవంతపు వివాహాలు చేయరాదని అన్నారు.

రైతుల గుండెల్లో తుపాను

- వాయుగుండం ప్రభావం
- కోసిన వరి పంటను ఒడ్డుకు చేర్చుతున్న రైతులు



తాటిపర్తిలో వరి పంటను ఒడ్డుకు చేర్చి కుప్పలు పెడుతున్న రైతులు



వరిపనలను కల్లాలకు తరలిస్తున్న రైతులు



కోమరవోలులో పంట భూమిలో కోసి ఉన్న వరి పొలం

మాడుగుల రూరల్ : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో పండిన వరి పంటను గతంలో కోసిన రైతులు ఒడ్డుకు చేర్చే పనిలో బిజి బిజీగా ఉన్నారు. మండలంలో 90 శాతం మేర వరి పంట పండింది. వాయుగుండం ప్రభావంతో రైతులు వరి కోతలు వాయిదా వేసుకున్నారు. మండలంలో 11 వేల ఎకరాల్లో వరి పంట వేశారు. ప్రస్తుతం పది శాతం కోతలు పూర్తయ్యాయి. తుపాను బారిన పడకుండా రైతులు తగు సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు గ్రామాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు, ఉద్యానవనశాఖ సహాయకులు, రైతులకు అవగాహన కల్పించారు. దండోరా వేసి తుపాను ప్రభావం తగ్గే వరకూ నాలుగు నుంచి ఐదు రోజుల పాటు వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే కోసిన వరి పంటను పొలంలో లేదా చిన్న కుప్పలుగా పెట్టుకోవాలని సూచనలు చేశారు. వర్షాలకు వరి పనలు తడిసిపోతే గింజ మొలక ఎత్తకుండా, గింజ రంగు మారకుండా ఉండడానికి 50 గ్రాముల కళ్లు ఉప్పు ఒక లీటరు నీటిలో కలిపి వరి పనలు మీద పిచికారీ చేసుకోవాలన్నారు.

మాకవరపాలెం : మండలంలో ఈ ఏడాది 1410 హెక్టార్లలో వరిపంట సాగు చేశారు. ముందుగా నాట్లు వేసిన కొండల అగ్రహారం, గిడుతూరు, మల్లవరం, మాకవరపాలెం, పి.పి.అగ్రహారం, తదితర ప్రాంతాల్లో రైతులు కోతలు ప్రారంభించారు. తుపాను హెచ్చరికలు జారీకావడంతో వరి పనలను పొలాల్లోనూ, సమీప కల్లాల్లో కుప్పలుగా పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. రైతులు ఆదివారం వరకు కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

రోలుగుంట : తుపాను నేపథ్యంలో మండల రైతులు వరికోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి సచివాలయాల్లోని గ్రామస్థాయి సహాయ వ్యవసాయాధికారుల ద్వారా రైతులకు సమాచారం ఇచ్చారు. కొమరవోలు, రోలుగుంట, కొవ్వూరు, భాగాపురం గ్రామాల్లో కోతలు జరిగాయి. తుపాను నేపథ్యంలో పంటను తరలించి రైతులు కుప్పలు వేసుకుంటున్నారు. కుప్పలు వేసుకున్న వరిపైరు తడవకుండా సంరక్షించుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు.తహసీల్దార్ ఎస్.నాగమ్మ, ఎంపీడీవో నాగేశ్వరావు కూడా రైతులకు సహాయక చర్యల కోసం అందుబాటులో ఉన్నారు.

యంత్రాలతో నూర్పిళ్లు



అందుబాటులోకి వచ్చిన హార్వెస్టర్

మాడుగుల : ఒకవైపు వరి పంటలో రెక్క రాల్చడం, మరోవైపు తుపాను బెంగతో రైతులు కోతలకు దిగారు. చేలు కోయకపోయినా సరే రెక్కలు వదులుతూ గింజలు నేల పాలవుతున్నాయని, తప్పని పరిస్థితిలో రైతులు వరి కోతలకు దిగుతున్నారు. అయితే కోతలు ముమ్మరం కావడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు కోత, నూర్పిడి యంత్రాలతో పనులు చేస్తున్నారు. అయితే ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పొలాల్లోనే ధాన్యం ఆరబడుతున్నారు. ఎకరా పొలంలో కోతతో పాటు నూర్పిడికి యంత్రం ద్వారా రూ. 3,500 ఖర్చు అవుతుంది. యంత్రాలు అందుబాటులోకి రావడంతో నూర్పిడి కోతలు ఏకకాలంలో పూర్తి చేసుకుంటున్నారు.

వైభవంగా నల్లమారమ్మతల్లి జాతర



ఆలయానికి పశువులతో కలసి వెళుతున్న గ్రామస్తులు

మాకవరపాలెం : మండలంలోని జి.కోడూరులో నల్లమారమ్మతల్లి జాతరను వైభవంగా నిర్వహించారు. రెండేళ్లకొకసారి నిర్వహించే ఈ జాతరను స్థానికులు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. జాతర రోజున స్థానికులు పశువులతో ఆలయానికి వెళ్లడం ఏళ్ల తరబడి అనాదిగా వస్తోంది. ఈ సందర్భంగా ఉదయం నుంచి గ్రామస్తులంతా తమ పాడి పశువులతో స్థానిక సంతోషిమాత ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం డప్పులు, వాయిద్యాల నడుమ అమ్మవారి ఘటాలు, పశువులతో కలసి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. జాతర నేపథ్యంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, స్థానిక ఎస్ఐ దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో దుర్గాలమ్మ అమ్మవారికి శుక్రవారం పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి సారె ఊరేగింపు, మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఉచితంగా ట్రై సైకిల్ పంపిణీ



దివ్యాంగ విద్యార్థినికి ట్రైసైకిల్ అందజేస్తున్న రాజు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధి బి.అప్పలరాజు

చోడవరం : దివ్యాంగులకు అవసరమైన పరికరాలను వెంకన్నపాలేనికి చెందిన రాజు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అందించింది. చోడవరం జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న దివ్యాంగురాలైన విద్యార్థినికి ఈ ట్రస్ట్ ద్వారా ట్రైసైకిల్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి బి.అప్పలరాజు మాట్లాడుతూ తమ ఎడ్యుకేషన్ ట్రస్టు ద్వారా దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, కాలిపర్స్, ఇతర పరికరాలు ఇస్తున్నామన్నారు. రక్తదాన శిబిరాలు కూడా నిర్వహిస్తూ ప్రాణాపాయంలో ఉన్న అవసరమైన వారికి రక్తదానం చేస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ సమకూర్చుతున్నామని, అవసరమైన వారు తమన ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ను సంప్రదించాలన్నారు.